వర్షాలు కురువాలని వరుణుడికి పూజలు

కంది : వరుణుడు కరుణించాలని మక్త అల్లూరులో కప్పకు పూజ చేసి ఊరేగిస్తున్న గ్రామస్తులు

సిర్గాపూర్, జూన్ 23 : మండలంలోని గర్డెగాం గ్రామంలో గ్రామ ప్రజలు స్థానిక శివారులోని వరుణు దేవుడి గుడిలోని సోమవారం వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి నిండు కలశాలతో ఊరేగింపుగా వరుణుదేవుడి గుడి వరకు వచ్చారు. పుష్కలంగా వర్షాలు కురువాలని జలాభిషేకం పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి వనభోజనం చేశారు.

కందిలో..

కంది, జూన్ 23 : తొలకరి వర్షాల జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కోసం ఆశగా ఎదిరి చూస్తున్నారు. మృగశిర కార్తె మొదలై 15రోజులు కావస్తున్నా వర్షాలు కురువకపోవడంతో గందరగోళ పరిస్థితులకు దారి తీస్తుంది. తొలకరి జల్లులు ఎలాగైనా కురుస్తాయన్న నమ్మకంతో కంది మండలంలోని రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేసి ప్రతి రోజు ఆకాశం వైపు చూస్తూ నిరాశ చెందుతున్నారు. వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేస్తూ దేవున్ని వేడుకుంటున్నారు. మండలంలోని మక్తఅల్లూరు గ్రామంలో రైతులు, గ్రామస్తులు కప్పపూజ నిర్వహించారు. వరుణుడు కరుణించాలని కప్పను గ్రామంలో ఊరేగించారు.

అందోల్‌లో..

అందోల్, జూన్ 23 : వానకాలం ఆరంభంలో ఆడపా.. దడపా వర్షాలు పడ్డాయి. రైతులను మురిపించిన వరుణుడు పొలాల్లో విత్తనాలు వేసిన నాటి నుంచి ముఖం చాటేయడంతో పంటలు ఎండుతూ రైతులు వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఎండుతున్న పంటలను కాపాడాలంటూ మొక్కులు మొక్కుతూ పూజలు చేస్తున్నారు. నేరడిగుంటలో గ్రామస్తులు మల్ల న్న ఆలయంలో దేవతా మూర్తులకు నీటితో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. వానల కోసం పూజలు నిర్వహిస్తున్నామని సంఘసేవకుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అందోల్ : నేరడిగుంటలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

పిల్లలను క్రీడల్లో భాగస్వాములు చేయాలి

డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యమ్

సంగారెడ్డి, జూన్ 23 : చిన్నతనం నుంచి పిల్లలను క్రీడల్లో భాగస్వాములు అయ్యే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని, క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శరీర దేహదార్ఢ్యం పెరిగి యువత మెరుగ్గా కదలికలు అవుతాయని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యమ్, పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ ఒలింపిక్ డేను పురస్కరించుకొని ఉమ్మడి మెదక్ ఒలింపిక్స్ అసోసియేషన్, డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో 39వ ఎడిషన్ ఆఫ్ ఒలంపిక్ డే రన్‌ను ముఖ్య అతిథుగా హాజరై ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడలు ఆడే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. మెదక్ ఉమ్మడి జిల్లా ఒలంపిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి మహ్మద్ జావెద్ అలీ, ఉపాధ్యక్షుడు హరికిషన్, మహ్మద్ జానీ, హన్మంత్‌గౌడ్, బుచ్చిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు వెంకటేశం, శేషపంత్, దశరథ్ పాల్గొన్నారు.

ఒలింపిక్స్ రన్‌ను ప్రారంభించిన డీసీసీబీ వైస్ చైర్మన్

ఘనంగా అంతర్జాతీయ ఒలంపిక్ డే..

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 23 : అంతర్జాతీయ ఒలంపిక్ డే వేడుకలను సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. 39వ అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో ఒలంపిక్ రన్ నిర్వహించారు. స్థానిక ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు ఈ రన్ ఉత్సాహంగా కొనసాగింది. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు జావేద్ అలీ, హరికిషన్, హన్మంత్ గౌడ్, దశరథ్ వెంకటేశం పాల్గొన్నారు.

జ్యోతిని వెలిగించి ఒలంపిక్ రన్ ప్రారంభిస్తున్న జావేద్ అలీ

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అందోల్ : ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ : సూపరింటెండెంట్ శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

అందోల్, జూన్ 23 : గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఎందుకు చెల్లించడంలేదని అడిగితే కానీ జీతాలు ఇవ్వరా.. అంటూ సీఐటీయూ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ జీపీ కార్మికులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని నెలలుగా పంచాయతీ కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు సరిగా స్పందించడంలేదని విమర్శించారు. దీంతో కార్మికులు పస్తులుండే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి వేతనాలు చెల్లించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తామన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, జూన్ 23 : జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా దవాఖానలో పనిచేసే కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి సూపరింటెండెంట్ శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులకు సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు సుమలత, గోపాల్, ముస్తాఫా పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును రద్దు చేయాలి

నల్లవల్లిలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, జూన్ 23 : మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ శివారులో ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, గుమ్మడిదల, మంభాపూర్ తదితర గ్రామాల్లో దీక్షలు చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని రైతు జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లవల్లి గ్రామంలో చేస్తు న్న రిలే నిరాహారదీక్ష సోమవారానికి 139వ రోజుకు చేరింది. వెంటనే డంపింగ్ యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణికి 71 ఫిర్యాదులు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 23 : అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు అందాయి. ఆయా అర్జీలను అదనపు కలెక్టర్లతో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఆయా ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నకిలీలపై ఫిర్యాదు

జిన్నారం, జూన్ 23 : మీసేవ నకిలీ సర్టిఫికెట్ల బాగోతం బొల్లారం మున్సిపాలిటీలో కలకలం రేపుతుంది. పారిశ్రామిక వాడలో నివసించే వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలను మీసేవ సర్టిఫికెట్ల పేరుతో పలు ఆన్‌లైన్‌లో నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారంపై బొల్లారం వాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నకిలీ పత్రాలను సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అర్జీదోసు కోరారు.

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హరీశ్‌రావును కలిసిన మాజీ జడ్పీటీసీ

మునిపల్లి మాజీ జడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ దంపతులు ఇటీవల ఆస్ట్రేలియా వెళ్లి వచ్చిన సందర్భంగా సోమవారం హైదారాబాద్‌లోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు పైతర సాయికుమార్, మండల నాయకులు మోహన్, సురేశ్ తదితరులు ఉన్నారు.

-మునిపల్లి,జూన్ 23

పటాన్‌చెరులో జోనల్ కమిషనర్ పర్యటన

జోనల్ కమిషనర్ హేమంత్ బోర్గాడేకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు రూరల్, జూన్ 23: శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్గాడే పటాన్‌చెరు డివిజన్‌లో పర్యటించారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్‌లో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలిసి జోనల్ కమిషనర్ పట్టణంలో తిరిగి పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, పారిశుధ్యం తదితర అంశాలను కార్పొరేటర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కార్పొరేటర్ అల్వీన్ కాలనీలో వరద నీటి సమస్య ఉందని తెలిపారు. గాంధీ థీమ్ పార్క్ వద్ద రోడ్డు పక్కన చిరు వ్యాపారులతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, స్ట్రీట్ వెండర్ జోన్‌ను నిర్మిస్తే చిరువ్యాపారులకు లాభం చేకూరుతుందన్నారు. శాంతినగర్ కాలనీలో పార్క్‌స్థలం అభివృద్ధి చేయాలని కోరారు. రూ. 2.50కోట్లతో నిర్మించిన క్రిమిటోరియం నిరుపయోగంగా ఉందని, దానిని అందరికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. నందన్ రతన్‌పైడ్ కాలనీకి రూ. 47లక్షల నిధులు ఇవ్వడంపై జోనల్ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. పటాన్‌చెరులో సమస్యలు పరిష్కరించేందుకు నిధుల కొరత లేకుండా చూడాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఎస్ఈ శంకర్‌నాయక్, డీసీ సురేశ్, ఈఈ సురేశ్, డీఈ నరేందర్, ఏఎంహెచ్‌వో విజయ్, ఏసీపీ రాణి, ఏఈ శివకుమార్, విజయ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు, జూన్ 23 : పటాన్‌చెరులో ప్రజలకు మౌలిక సదుపాయలు కలిపించేందుకు తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్‌లోని బ్లాక్ ఆఫీస్ వాకింగ్ ట్రాక్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి రోజు బ్లాక్ ఆఫీస్ సమీపంలో వాకింగ్ ట్రాక్‌పై చాలా మంది వాకింగ్ చేస్తారని అక్కడ పిచ్చి మొక్కలు తొలిగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచించారు. కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. చైతన్య నగర్ కాలనీ, గోకుల్ నగర్ కాలనీ, సీతారామపురం కాలనీలో కొత్తగా నిర్మాణం చేస్తున్న డ్రైనేజీ పనులు పరిశీలించారు. గడువులోగా పనులు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీ నాయకులు అంజిరెడ్డి, సంజీవరెడ్డి, విజయ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనాన్ని పరిశీలించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది

జిన్నారం, జూన్ 23: కబ్జా కోరల్లో బృహత్ పట్టణ ప్రకృతి వనం అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది 4 వార్డులోని బృహత్ పట్టణ ప్రకృతి వనం తనిఖీ చేసి రోడ్డు మార్గం నిర్మించిన కబ్జాకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు విధంగా చర్యలు తీసుకుంటామని సిబ్బంది పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది వినోద్, దినేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డును పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సిద్దిపేట పింక్ జట్టు ఘన విజయం

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 23 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్న అండర్-19 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో సిద్దిపేట పింక్ జట్టు 120 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కొండాపూర్ మండలం సీ కోనాపూర్‌లోని ఎంఏ క్రికెట్ మైదానంలో సంగారెడ్డి జిల్లా గ్రీన్ జట్టు, సిద్దిపేట జిల్లా పింక్ జట్ల మధ్య పోటీ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ జట్టు నిర్ధారిత 50 ఓవర్లలో 302 పరుగులు చేసింది. జట్టులో ఈశాంత్ 114 పరుగులు, చేతన్ 72 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గ్రీన్ జట్టు కేవలం 33.2 ఓవర్లలో 182 పరుగులు చేసి అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో 120 పరుగుల తేడాతో సిద్దిపేట పింక్ జట్టు ఘన విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఈ శాంత్ నిలిచాడు. ఈ పోటీలను ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

విజయం సాధించిన సిద్దిపేట పింక్ జట్టు

పేలిన సిలిండర్.. తప్పిన పెను ప్రమాదం

నిజాంపేట్, జూన్ 23 : ఇంట్లో వంట చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలి పెంకుటిల్లులో దూలాలు దగ్ధమై, వంట చేస్తున్న వ్యక్తి చేతులు కాలాయి. ఈ సంఘటన జంబికుంటలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండల పరిధిలోని జంబికుంట గ్రామానికి చెందిన నిరుడి మోహన్ ఇంట్లో సిలిండర్ పేలింది. రెండు రోజుల నుంచి గ్రామంలో భూలక్ష్మి అమ్మవారి జాతర ఉత్సవాలు జరుగుతుండగా ఊరిలో బంధువులతో సందడి నెలకొంది. ఇంట్లో బంధువులు ఉండటంతో సోమవారం ఉదయం అల్పాహారం కోసం వంట చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో వంట చేస్తున్న వ్యక్తి చేతులు కాలాయి.. అంతలోనే ఎగిసిపడుతూ మంటలు ఇంటి దూలాలు, ఇంటిలో విద్యుత్ బోర్డులు వైరుతో సహా అన్ని కాలిపోయాయి. చుట్టు పక్కల వారు సంఘటనా స్థలానికి వచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారని గ్రామస్తులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

సిర్గాపూర్, జూన్ 23 : మండలంలోని ఆయా గ్రామాల బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వాసర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవేందర్ తండ్రి పండరి మృతిచెందారు. సిర్గాపూర్‌లో నర్సమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని భూపాల్‌రెడ్డి వారి ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంజీవ రావుపాటీల్, అం బాదాస్, పండరిరెడ్డి, బాల్ రెడ్డి, రఫీ, గొల్ల వెంకన్న, సాయిలు, నర్సన్న, శ్రీనివాస్, శంక ర్, నర్సింహులు ఉన్నారు.

ఎరువుల శ్యాంపిల్ సేకరణ

ఎరువుల దుకాణంలో శ్యాంపిల్‌ను సేకరిస్తున్న మండల వ్యవసాయాధికారి లావణ్య

జహీరాబాద్, జూన్ 23 : జహీరాబాద్ పట్టణంలోని సాయిమాట్ ఎరువులు, విత్తనాల దుకాణాన్ని సోమవారం మండల వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక దుకాణంలో విక్రయిస్తున్న ఎరువులు, క్రిమిసంహారక మందులకు సంబంధించిన స్టాక్ రికార్డులు, నిల్వలను మండల వ్యవసాయాధికారి లావణ్య పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, మందులను రైతులకు విక్రయించాలన్నారు. వాటికి సంబంధించిన ఇన్వాయిజ్, సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లు తప్పని సరిగా ఉండాలన్నారు. రైతులకు విక్రయించే ఎరువులు, మందులకు తప్పని సరిగ్గా రసీదులను ఇవ్వాలని సూచించారు. నాసిరకం ఎరువులు, క్రిమిసంహారక మందులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణంలో విక్రయిస్తున్న ఎరువుల నాణ్యతను పరీక్షించేందుకు సేకరించిన శ్యాంపిల్ ఎరువులను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

పరిశ్రమలకు భూములిచ్చిన రైతులకు ఉద్యోగాలు ఇవ్వాలి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామచందర్

జహీరాబాద్, జూన్ 23 : పరిశ్రమల ఏర్పాటు కోసం భూములిచ్చిన రైతులకు ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామచందర్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామానికి చెందిన బాధిత రైతులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో బూచినెల్లి శివారులో పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు భూ సేకరించారన్నారు. అప్పట్లో రైతులు పరిశ్రమల ఏర్పాటుకు రైతులు నిరాకరించారన్నారు. సంబంధిత అధికారులు రైతులతో చర్చలు జరిపి భూములు కోల్పోతున్న రైతుల కుటుంబాలకు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటైన ఉత్పత్తులు కొనసాగుతున్నా నేటికీ ఉద్యోగాల మాట ఎత్తడం లేదన్నారు. జాతీయ రహదారికి సమీపంలోనే ఉన్న భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం కింద రూ. 3.50 లక్షలు మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జహీరాబాద్ ఆర్డీవో, తహసీల్దార్‌లకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. ఇప్పటికైనా బాధిత రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పటాన్‌చెరు : గీతం విశ్వవిద్యాలయంలో మొక్క నాటుతున్న డీఎస్పీ ప్రభాకర్, సిబ్బంది

జహీరాబాద్‌లోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో మొక్క నాటుతున్న డీఎస్పీ సైదానాయక్

పటాన్‌చెరు, జూన్ 23 : విద్యార్థులు, యువతీ, యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా రుద్రారంలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ ఆవరణలో డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక రెడ్డి, డీఐ రాజుతో కలిసి మొక్కలు నాటారు. గీతం హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీ ఎస్ఆర్ వర్మ, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలీం, ఎస్టేట్ అధికారి మోహన్, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో..

సిర్గాపూర్, జూన్ 23 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్సై వెంకట్‌రెడ్డి, నారాయణ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ నివారణ వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మత్తు పదార్థాలకు బానిస కావొద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జిన్నారంలో..

జిన్నారం, జూన్ 23 : విద్యార్థులు, యువత ఎటువంటి దురలవాట్లకు బానిసలు కావొద్దని బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. ఎస్సైలు దశరథ్, కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, జూన్ 23 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ కోరారు. జహీరాబాద్ పట్టణంలోని డాక్టర్ ఆర్ఎల్ఆర్ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీవాణి విద్యాలయంలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల అవరణలో మొక్కలను నాటారు. జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు శివలింగం, హనుమంతు, ఎస్సైలు వినయ్ కుమార్, కాశీనాథ్, చల్లరాజశేఖర్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్య

జిన్నారం, జూన్ 23 : భర్త మృతితో తీవ్రంగా కుంగిపోయిన భార్య ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వైఎస్సార్ కాలనీలో నివసించే గొల్ల అమరావతి (50) ఈనెల 22న భర్త గుల్ల గణేశ్ (55) కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. భర్త మృతితో తీవ్రంగా కుంగిపోయిన భార్య అమరావతి 23న ఇంట్లో డోర్ లాక్ చేసి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు కాపాడే ప్రయత్నంలో దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త దూరమవడంతోనే తీవ్ర మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. ఒక్కరోజు వ్యవధిలో ఇద్దరూ మృతి చెందడం కాలనీలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఉపాధ్యాయుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హత్నూర, జూన్ 23 : మండల పరిధిలోని గుండ్లమాచునూర్ శివారులోని తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాలలో హిందీ సబ్జెక్టు బోధించుటకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. తాత్కాలిక ప్రాతిపాదికన బోధించేందుకు అర్హత ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27 లోపు పాఠశాలలో అర్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9177394959 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'కస్తూర్బా'లో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్, జూన్ 23 : మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేసేందుకు ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక పాఠశాల ప్రత్యేకాధికారి లక్ష్మి తెలిపారు. ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులకు పదో తరగతి పాసై, అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టులకు 7వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. కనీస వయస్సు 18 ను